# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 343 | పేజీలు: 4 | వెల: 4/- | శుక్రవారం ● 28, జూన్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




## డ్రగ్స్ వాడకంపై జాగ్రత్తగా ఉండాలి

### రాచకొండ సీపీ తరుణ్ జోషి హెచ్చరిక

హైదరాబాద్,జూన్27(నమస్తే ఉదయం): సాధారణ ప్రజలు, విద్యార్థులు అందరూ డ్రగ్స్ రహిత సమాజం తమ బాధ్యతగా భావించాలని రాచకొండ సీపీ తరుణ్ జోషి అన్నారు. తమ పరిసరాల్లో, కాలేజీల్లో, పాఠశాలల్లో మత్తు పదార్థాల వాడకం గురించి పరిశీలిస్తూ ఉండాలని సూచించారు.

మిగతా.. 2లో

# పిసిసి చీఫ్ కోసం కాంగ్రెస్ కసరత్తు..

### ఎవరిని నియమించినా కలిసి పనిచేస్తానని వెల్లడి

### రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చానన్న తృప్తి


### తన పదవీకాలం ముగిసిందన్న సిఎం రేవంత్ రెడ్డి

### సోనియాతో మధుయాష్కీ, మహేశ్ కుమార్ గౌడ్‌ల భేటీ

### పిసిసి కోసం పోటీ పడుతున్న పలువురు సినియర్ నేతలు

న్యూఢిల్లీ,జూన్27(నమస్తే ఉదయం): టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తవారిని నియమించేందుకు ఏఐసీసీ కసరత్తు చేస్తోందనే ప్రచారం నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన పీసీసీ అధ్యక్ష పదవీకాలం ముగిసిందని అన్నారు. పీసీసీ కొత్త అధ్యక్షుడిగా ఎవరిని నియమించినా వారితో కలిసి పని చేస్తానని, అధ్యక్షుడి నియామకంపై తనకంటూ ప్రత్యేక ఛాయిస్ ఏదీ లేదని ఆయన స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎవర్ని నియమించినా వారితో కలిసి పనిచేయడమే తన బాధ్యత అని అన్నారు. తాను టీపీసీసీగా ఉన్న కాలంలో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిందని, పార్లమెంటు ఎన్నికల్లో మంచి పనితీరు కనబరిచామని ఆయన అన్నారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ..అసెంబ్లీ ఎన్నికలకు మించి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటింగ్ శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఇక కేసీఆర్ పూర్తిగా చేతులెత్తేయడం వల్లే బీజేపీకి లాభం జరిగిందని పునరుద్ఘాటించారు. బీఆర్ఎస్‌కు డిపాజిట్లు వచ్చిన చోట తాము గెలిచామని, బీఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోయిన చోట బీజేపీ గెలిచిందని అన్నారు. తాను కక్షపూరిత రాజకీయాలకు పాల్పడబోనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేసీఆర్‌కు గద్దె దింపాలన్న తన జీవిత లక్ష్యం నెరవేరిందని అన్నారు. ముఖ్యమంత్రిగా నా రెండో కల నెరవేరింది. బీఆర్ఎస్‌ను లోక్‌సభలో జీరో చేశాను. ఆ పార్టీని సున్నా చేయాలన్న కోరిక కూడా నెరవేరింది. తెలంగాణను పునర్నిర్మించడమే ఇప్పుడు నా ముందున్న ఏకైక లక్ష్యం. కేసీఆర్ పాలనలో తెలంగాణ పూర్తిగా ధ్వంసం అయిందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మరోవైపు తెలంగాణ పీసీసీ చీఫ్ ఎన్నికపై అధిష్టానం కసరత్తు పూర్తి చేసిందని తెలుస్తోంది. ముఖ్య నాయకులను అందుబాటులో ఉండాలని ఏఐసీసీ ఆదేశించింది. రాత్రి 8 గంటలకు ముఖ్య నాయకులతో సీఎం రేవంత్.. ఇంఛార్జి దీపా దాస్ మున్షి సమావేశం అవుతారు. ఆ తర్వాత ప్రకటన ఉంటుంది. ఇప్పటికే ఆశావహులు తమ ప్రయత్నాలు తాము చేసుకుంటున్నారు. పార్లమెంట్ హాల్‌లో సోనియాగాంధీని వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ కలిసి చర్చించారు. తమ పేర్లను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ పార్టీని గెలిపించారు. ఆయనకు సీఎం పదవి వచ్చింది. ఇక పార్టీ బాధ్యతల నుంచి ఆయనను తప్పించి వేరే వారికి ఇస్తారని చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. కానీ అది ప్రచారంగానే ఉంది. లోక్ సభ ఎన్నికలు అయిపోయాయి. ఈ నెల 27వ తేదీతో అంటే గురువారంతోనే రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడై 3 సంవత్సరాలు పూర్తి అవుతోంది. కాంగ్రెస్ పార్టీ నియమ నిబంధనల ప్రకారం పీసీసీ చీఫ్ పదవికాలం 3 సంవత్సరాలు.

మిగతా.. 2లో



## నేడు వరంగల్‌కు సిఎం రేవంత్ రెడ్డి

### వరంగల్ రెండోరాజధానిగా అభివృద్ధి

### పలు పరిశ్రమల ఏర్పాటు, ఆసుపత్రి నిర్మాణాలపై పరిశీలన

### అధికారులతో సమీక్ష ఉంటుందన్న మంత్రి కొండా సురేఖ



వరంగల్,జూన్27(నమస్తే ఉదయం): వరంగల్ ను రెండో రాజధాని చేసే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి కార్యాచరణ ఉందని మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం వరంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఉందన్నారు. మధ్యాహ్నం 1గంటకు టెక్స్ టైల్ పార్క్ కు చేరుకుని పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పనపై సీఎం పరిశీలస్తారని తెలిపారు. వరంగల్‌లో నూతనంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సందర్శిస్తారని చెప్పారు.

మిగతా.. 2లో



# సీతారామా ట్రయల్ రన్ విజయవంతం

### గోదావరి వద్ద మంత్రి తుమ్మల పూజలు

### అధికారులు, ఇంజనీర్లకు మంత్రి అభినందనలు

ఖమ్మం,జూన్27(నమస్తే ఉదయం): ఉమ్మడి ఖమ్మం జిల్లా కలల ప్రాజెక్టు సీతారామా ప్రాజెక్టు ప్రారంభానికి సిద్ధమవుతోంది. గురువారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయ్యింది. ప్రాజెక్టులోని మొదటి పంపు నుంచి గోదావరి జలాలను ట్రయల్ రన్‌లో విడిచి పెట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్టు మోటార్ల ట్రయల్ రన్ సక్సెస్ అయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులతో కలిసి మోటార్ల ట్రయల్ రన్‌ను పర్యవేక్షించారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో మంత్రి తుమ్మల హర్షం వ్యక్తం చేశారు. ఆగస్టు 15 నాటికి ప్రాజెక్టుకు సంబంధించిన పక్రియను పూర్తి చేసి ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకు తగ్గట్టుగానే ముందస్తుగా ట్రయల్ నిర్వహించింది. ఈ మేరకు మంత్రి తుమ్మల సమక్షంలో ట్రయల్ రన్ జరిగింది.ఉమ్మడి ఖమ్మంలోని సుమారు పది లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు ఉద్దేశించి అశ్వాపురంలో సీతారామ ప్రాజెక్ట్‌ను మంత్రి తుమ్మల లాంఛనంగా ప్రారంభిం చారు. ఈ ప్రాజెక్టు దాదాపు పూరత్యింది. దీనికి సంబంధించిన ట్రయల్ రన్‌ను గురువారం చేపట్టారు. మొదటి పంపు నుంచి గోదావరి నీళ్లు ఎగసి పడుతుంటే మంత్రులు, ప్రజాప్రతినిధులు సామాన్య ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భూమాతకు ప్రణమిల్లారు. ఎన్నో ఏళ్ల ప్రజల కల నెరవేరే సమయం ఆసన్నమైందన్న మంత్రులు వీలైనంత త్వరగా పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. తన చివరి కోరిక ఖమ్మం జిల్లా ప్రజలకు గోదావరి జలాలు అందివ్వడమేనని అది నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రాజెక్టులో భాగమైన ఇంజనీర్లకు, భూములు ఇచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. 2004 కంటే ముందే దీనికి ప్రతిపాదనలు సిద్ధమైన రూపుదాల్చలేదు. 2016 ఫిబ్రవరి 16న కేసీఆర్ సీఎం హోదాలో శంకుస్థాపన



చేశారు. కాంగ్రెస్ హయాంలో పనులు పూర్తి అయ్యాయి. గత కేసీఆర్ ప్రభుత్వంలో 17 వేల కోట్ల అంచనాతో ప్రతిష్టాత్మకం గా సీతారామ ప్రాజెక్టు చేపట్టారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్ ట్రయల్‌రన్‌లో పాల్గొని అధికారులతో కలసి పంప్ హౌస్ మోటార్ల పనితీరును వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ట్రయల్ రన్ విజయవంతం కావడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు.

పంప్‌హౌస్ వద్ద గోదావరికి మంత్రి పూజలు చేశారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారులను అభినందించారు. ఈ ప్రాజెక్ట్‌తో ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలోని 10 లక్షల ఎకరాలకు సాగు నీరు అందనున్నది.

మిగతా.. 2లో

## బార్లు, రెస్టారెంట్లపై మహా సర్కార్ కొరడా



### అక్రమంగా వెలిసిన వాటిపై బుల్‌డోజర్లు

### నిర్దాక్షిణ్యంగా కూల్చివేతలకు సిఎం షిండే ఆదేశాలు

ముంబై,జూన్27(నమస్తే ఉదయం): మహారాష్ట్ర ప్రభుత్వం అక్రమ పబ్బులు, బార్లు, రెస్టారెంట్లపై కీలక నిర్ణయం తీసుకుంది. థానే, మీరా భైందర్ పట్టణాల్లో అనుమతి లేకుండా నిర్వహించే పబ్బులు, బార్లను బుల్డోజర్లతో కూల్చివేయాలని మహారాష్ట్ర సీఎం షిండే మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ కమిషనర్‌లను ఆదేశించారు. డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. మహారాష్ట్రలో ప్రతి నగరం, పట్టణం డ్రగ్స్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పూణె ఫెర్గూసన్ కాలేజ్ రోడ్‌లోని లిక్విడ్ లీజర్ లాంజ్ నుండి వైరల్ అయిన వీడియోలో... కొంతమంది యువకులు డ్రగ్స్ తీసుకున్నట్లుగా గుర్తించారు. ఆ యువకులు మాదక ద్రవ్యాలను రవాణా చేస్తున్నారని పోలీసులు అనుమానం


మిగతా.. 2లో

## బీహార్‌లో కూలిన మరో వంతెన

### వారంలో నాలుగో ఘటన ఇది

పట్నా,జూన్27(నమస్తే ఉదయం): బిహార్‌లో మరో వంతెన కూలిపోయింది. కిషన్‌గంజ్ జిల్లాలో బన్సుబరి శ్రవణ్ చౌక్ వద్ద మరియా నది ఉపనదిపై నిర్మించిన వంతెన గురువారం కూలిపోయింది. దీంతో బిహార్‌లో వారం రోజుల్లో నాలుగు వంతెనలు కూలిపోయినట్లు అయింది. భారీ వర్షం తాకిడికి ఈ వంతెన కూలిపోయిందని స్థానికులు పేర్కొన్నారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని తెలిపారు.

3 ఏళ్ల క్రితం అంటే గ్రామీణ పనుల విభాగం రూ. 25 లక్షల



వ్యయంతో ఈ 70 మీటర్ల పొడవైన వంతెనను నిర్మించారని వారు తెలిపారు. ఇక ఈ నిర్మాణం పూర్తయి..

మిగతా.. 2లో



## గురుకులాల్లో స్పెషల్ కోటా ఇవ్వాలి

### ప్రభుత్వం వెంటనే సర్క్యులర్ జారీ చేయాలి

### విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి

హైదరాబాద్,జూన్27(నమస్తే ఉదయం): రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, బి. రాజశేఖర్, కార్యదర్శులు బి. జగదీశ్వర్, గండ్ర నవీన్, రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణ్ కుమార్, ఎం.రమేష్

మిగతా.. 2లో

## కెసిఆర్ హయాంలో ఆర్థిక విధ్వంసం

### రూ.42 వేల కోట్లు ఖర్చుతో మిషన్ భగీరథ దోపిడీ

### గ్రామాలకు నేటికీ అందని మంచినీరు

### రూ.130 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

### భద్రాద్రి జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న భట్టి

ఖమ్మం,జూన్27(నమస్తే ఉదయం): గత కెసిఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి ఆర్థిక విధ్వంసం చేశారన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో

మిగతా.. 2లో




## శాం పిట్రోడాకు కాంగ్రెస్ కీలక బాధ్యతలు

### భారతీయులను అవమనించిన వ్యక్త పిట్రోడా

### ఇలా జరుగుతుందని మోడీ ఆనాడే చెప్పారు

### కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ఎద్దేవా



న్యూఢిల్లీ,జూన్27(నమస్తే ఉదయం): వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే కాంగ్రెస్ నేత శాం పిట్రోడాకు పార్టీలో మళ్లీ కీలక బాధ్యతలు అప్పగించడం చర్చనీయాంశం అయింది. దీనిపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ, కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఇలా జరుగుతుందని ప్రధాని మోడీ ఆనాడే చెప్పారని గుర్తు చేశారు. ‘రూపు రేఖలను ఉద్దేశిస్తూ భారతీయులను అవమానపర్చిన రాహుల్ గాంధీ సలహాదారును (పిట్రోడా) మళ్లీ కీలక బాధ్యతల్లోకి తీసుకున్నారు. ఇది మమ్మల్ని ఆశ్చర్యపర్చలేదు. ఎందుకంటే ప్రధాని మోడీ దీన్ని ముందుగానే ఊహించారు. ‘అని రిజిజు రాసుకొచ్చారు. దీంతోపాటు ఓ ఇంటర్వ్యూలో మోడీ మాట్లాడుతున్న వీడియోను జత చేశారు. అటు బీజేపీ కూడా ఈ వీడియోను పోస్ట్ చేసింది. ‘కొన్నిసార్లు ఆ పార్టీ (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ) పక్కా ఎలాన్‌తో ఉంటుంది. వారి నేతలు సొంతంగా అలాంటి వ్యాఖ్యలు చేస్తారని నేను అనుకోను. ముందు వారితో అలా మాట్లాడిస్తారు. ఆ తర్వాత పార్టీ వారిని దూరం పెడుతుంది. కొన్నాళ్లకు మళ్లీ వారిని

మిగతా.. 2లో



## సింగరేణిని ప్రైవేటీకరించేందుకే బొగ్గు గనుల వేలం

### మోడీతో కుమ్మక్కయిన సిఎం రేవంత్ రెడ్డి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్,జూన్27 (నమస్తే ఉదయం): సింగరేణిని ప్రైవేటీకరించేందుకే తెలంగాణ బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం వేలం వేసిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో సింగరేణి ప్రాంతానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతోపాటు బొగ్గు గని కార్మిక సంఘం నాయకులతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..

మిగతా.. 2లో

## ఈనెల 29న కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనం చేసుకోబోతున్న

# ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్...

### ఘనంగా స్వాగతం పలికేందుకు నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం...



**కూకట్‌పల్లి, జూన్ 27 (నమస్తే ఉదయం):** కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని 5 ఫేస్ జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ కు ఘన స్వాగతం పలికేందుకు కూకట్ పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటి సారిగా ఈ 29న తెలంగాణ రాష్ట్రంలోని కొండగట్టు అంజన్న సన్నిధిలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు విచ్చేస్తున్నారు. జనసేన నాయకులు మరియు వీర మహిళలు నియోజకవర్గం నుంచి తరలి వెళ్లి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, కాకుమాను లక్ష్మణరావు, వేముల మహేష్ , కలిగినిడి ప్రసాద్, అడబాల షణ్ముఖ, పులగం సుబ్బు , పసుపులేటి ప్రసాద్, ఆకాష్ రెడ్డి, మణికంఠ, వీర మహిళలు అడబాల లక్ష్మీ , శిరీష తదితరులు పాల్గొన్నారు.



## భరోసా నూతన భవనాన్ని పరిలించిన జిల్లా ఎస్పీ తోట శ్రీనివాస రావు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 27(నమస్తే ఉదయం):** జిల్లా కేంద్రంలోని రెవెన్యూ కాలనిలో నూతనంగా నిర్మాణం అయిన భరోసా భవనాన్ని జిల్లా ఎస్పీ తోట శ్రీనివాస రావు, అదనపు ఎస్పీ గుణ శేఖర్ కలిసి పరిశీలించారు. రూ.2 కోట్లతో నిర్మించిన భవన నిర్మాణం పూర్తి కావచ్చినందున త్వరలో ప్రారంభించేందుకు భవనాన్ని సిద్ధం చేయాలని భరోసా ఇంచార్జి ఎస్సై అరుణ సూచించారు.

ఈ కార్యక్రమంలో గద్వాల్ సిఐ బీమ్ కుమార్, భరోసా కో ఆర్డినేటర్ శివాని తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య సిబ్బందితో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

## ఎల్లమ్మ బండలో ప్రజలు ఎదుర్కొంటున్న

# విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరిస్తాం

**- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

**కూకట్‌పల్లి, జూన్ 27 (నమస్తే ఉదయం):** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో ఉన్న విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలో ఉన్న విద్యుత్‌కు సంబంధించిన సమస్యలపై మేడ్చల్ జోన్ సీజీ ఎం కె.సాయిబాబాతో కలిసి ఎల్లమ్మబండ స్లమ్ ప్రాంతాలలో పాదయాత్ర చేస్తూ విద్యుత్ సమస్యలను ఇన్స్పెక్షన్ చేశారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కొన్ని చోట్ల విద్యుత్ వైర్లు, స్తంభాలు మార్చాలని, కొత్త ట్రాన్స్ఫార్మర్స్ ఏర్పాటు చేయడం, పాత ట్రాన్స్ఫార్మర్స్‌కు చుట్టూ ఫేనిషింగ్ లేక చాలా ప్రమాదకరంగా ఉన్నాయని కార్పొరేటర్ విద్యుత్ శాఖ అధికారులకు వివరించారు. అదేవిధంగా కొన్నిచోట్ల రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంబాలను ప్రక్కకు జరప వలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు కూకట్‌పల్లి డిఈ చక్రవర్తి, ఏ డి ఈ ప్రసాద్, భాగ్యనగర్ ఏఈ షాబా, కాంగ్రెస్ పార్టీ నాయ కులు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, వెంకట్ నాయక్, షౌకత్ అలీ, మున్నా, సయ్యద్, అశోక్, శంకర్ గౌడ్, ఫారూఖ్, ఖలీమ్, బషీర్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

## బార్లు, రెస్టారెంట్లపై

# మహా సర్కార్ కొరడా

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. ఈ ఘటన జరిగిన 48 గంటలు తరువాత పూణెలో అక్రమంగా నిర్వహించే పబ్బు,బార్లను ధ్వంసం చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణం తీసుకుంది. దీంతో నియమాలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను కూల్చివేత కార్యక్రమం చేపట్టారు. పుణెళిలోని అక్రమ పబ్బులు, బార్స్, రెస్టారెంట్లపై పుణెళి మున్సిపల్ కార్పొరేషన్ (పీఎంసీ) కొరడా ఝులిపించింది. ఇప్పటివరకు 33 అక్రమ పబ్బులను బుల్డోజర్లతో కూల్చివేసింది. వీటిలో పేరున్న పబ్బులు కూడా ఉన్నాయి. ముంబయిలోని ముఖ్యమంత్రి కార్యాలయం పూణెళిను డ్రగ్స్ రహిత నగరంగా మార్చడానికి డ్రగ్స్ పెడ్లర్లపై నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని పోలీసులకు సీఎం షిండే ఆదేశాలు జారీ చేశారు. మహారాష్ట్రలో అతిపెద్ద నగరంలో మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టే దిశగా ఓ వీడియో వైరల్ వీడియోపై పోలీసుల దర్యాప్తు ఈవెంట్ ఆర్గనైజర్‌తో సహా ఎనిమిది మంది వ్యక్తులను అరెస్టు చేశారు. నిబంధలను విరుద్ధంగా ..అక్రమంగా నిల్వ చేసిన డ్రగ్స్, మద్యం స్టాక్ ను స్వాధీనం చేసుకుని .. ఎల్ 3 నుండి ఆరుగురు వెయిటర్లను ఎక్సైజ్ శాఖ అదుపులోకి తీసుకుంది. మహారాష్ట్ర ముంబైలో ఇంటర్నేషనల్ స్టాండర్డ్ సెంట్రల్ పార్క్‌ను ఏర్పాటు చేయనుంది . ఇదిలా ఉండగా, విద్యా, ఐటీ హబ్‌లకు పేరుగాంచిన పూణెలో తమ పార్టీ పబ్ కల్చర్‌ను అనుమతించబోదని బీజేపీ పూణె యూనిట్ అధ్యక్షుడు ధీరజ్ ఘాటే ప్రకటించారు. పబ్ కల్చర్‌కు వ్యతిరేకంగా పోలీసులు, పూణెళి మున్సిపల్ కార్పొరేషన్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ గట్టి చర్యలు తీసుకోవాలని ఘాట్ పిలుపునిచ్చారు. రాజకీయ ప్రతిచర్యలు పూణెళిలోని కస్బా నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే రవీంద్ర ధంగేకర్ నగరంలో గణనీయమైన స్థాయిలో డ్రగ్స్ లభ్యమయ్యాయని ఆరోపించారు. పోలీసుల సహకారంతో ఈ వ్యాపారం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణలు పూణెళిలో మాదకద్రవ్యాల సంబంధిత సమస్యలపై పోరాడతామనన్నారు. పూణెళిలోని నైట్ లైఫ్ సీన్‌లో డ్రగ్స్ వినియోగం పెరుగుతుంది. ఈ క్రమంలో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు నిర్వహించే సంస్థలపై .. ఆ సంస్థల నిర్వాహకులను కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.చట్టవ్యతిరేక కార్యకలాపాల నీడన పడకుండా విద్య, ఐటీ పరిశ్రమలకు పుణె కేంద్రంగా ఉండేలా కృషి చేస్తామని సీఎం షిండే అన్నారు.

## సింగరేణిని ప్రైవేటీకరించేందుకే బొగ్గు గనుల వేలం

(మొదటి పేజీ తరువాయి)

మోదీ ప్రభుత్వంతో సీఎం రేవంత్ రెడ్డి కుమ్మక్కై.. బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అందుకే సింగరేణికి బొగ్గు గనులు కేటాయించకుండా నష్టాల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆ తర్వాత సింగరేణి నష్టాల్లో ఉందంటూ పెట్టుబడుల ఉపసంహరణ కోసం రంగం సిద్ధం చేస్తున్నారని విమర్శిం చారు. అయితే కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై సింగరేణి గనులను అమ్మ కానికి పెట్టిన విషయం.. ప్రతి సింగరేణి కార్మికుని అర్థమవుతోందన్నారు. ఇక తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన సకల జనుల సమ్మె కారణంగా సింగరేణి ప్రాధాన్యతను దేశం గుర్తించిందని చెప్పారు. ఈ సమ్మె జరిగిన సమయంలో.. దక్షిణాది రాష్ట్రాలు అతలాకుతలమయ్యా యని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతమే మన పార్టీ విధానమని కేటీఆర్ పునరుద్ఘాటించారు. ఉద్యమ కాలంలోనే కాదు.. అనంతర ప్రభుత్వంలో ఉన్నప్పుడు సైతం తమది ఇదే విధానమన్నారు. అందుకే ప్రైవేటు కంపెనీల ఒత్తిడులను పక్కన పెట్టి... రైతు బీమాను ఎల్ఐసీ ఇచ్చామని పేర్కొన్నారు. అలాగే విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణ బాధ్యతలను సైతం బీహెచ్ఈఎల్‌కి అప్పగించామని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హాయాంలో తెలంగాణ బొగ్గు గనులను వేలం వేయకుండా ఆపగలిగారన్నారు. కేంద్ర ప్రభుత్వం బలవంతంగా రెండు బొగ్గు గనులను ప్రైవేట్ సంస్థలకు కేటాయించి నప్పటికీ.. తట్టెడు తెలంగాణ బొగ్గును ఎత్తకుండా విజయవంతంగా అడ్డుకున్నామని కేటీఆర్ వివరించారు. అయితే కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు.. ఆ పార్టీ నాయకత్వం కలిసికట్టుగా తెలంగాణ బొగ్గు గనులను వేలానికి పెట్టాయని మండిపడ్డారు. పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక లేదన్న ఓ విధమైన భ్రమతోనే కాంగ్రెస్, బీజేపీలు ఈ కుటిల ప్రయత్నాలకు తెర తీశాయన్నారు. సింగరేణి కోసం మొదటి నుంచి పోరాటం చేసి... ఆ సంస్థను బలోపేతం చేసిందే బీఆర్ఎస్ పార్టీ అని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. సింగరేణి కష్టాల్లో ఉంటే కార్మికులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందన్న విషయాన్ని సైతం ఆ యా పార్టీల నేతలు మర్చిపోతున్నారన్నారు.

# కెసిఆర్ హయాంలో ఆర్థిక విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.130 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అనంతరం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో భట్టి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో మిషన్ భగీరథ కోసం రూ.42 వేల కోట్లు ఖర్చు పెట్టారన్నారు. అయినా ఇంటింటికి తాగు నీరు ఇవ్వలేదన్నారు. ప్రతి ఇంటికి పూర్తి స్థాయిలో నీళ్లు ఇచ్చామని చెప్పారని, రూ.125 కోట్లతో మళ్లీ పనులు ఎందుకు చేపడతామని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికీ చాలా గ్రామాలకు మంచి నీరు అందడం లేదన్నారు. గతంలో వెలుగులు నింపిన థర్మల్ ప్రాజెక్టులు మూతపడ్డాయని విమర్శించారు. థర్మల్ ప్రాజెక్టులు మొదలు పెడితే ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ప్రజలు కోరుతున్నట్లుగా పాల్వంచ, కొత్తగూడం మున్సిపాలిటీని కలుపుతామన్నారు. కొత్తగూడెంపి సింగరేణి స్థలాల్లో ఐటీ హబ్ ఏర్పాటు, ఐటీ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు కృషి చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత సీతారామా ప్రాజెక్టుకు 70 కోట్లు విడుదల చేయడంతో పనులు జరిగి ట్రయల్ రన్ సక్సెస్ అయిందన్నారు.

రెండు గంటల్లో హైదరాబాద్ నుంచి విజయవాడకు చేరేలా రోడ్లను నిర్మిస్తున్నామని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిని ఆరు లేన్ల రోడ్డుగా నిర్మిస్తున్నామన్నారు. కేంద్ర మంత్రి గడ్కరీతో మాట్లాడి రాష్ట్రానికి పలు జాతీయ రహదారులు తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో రహదారులను జాతీయ రహదారులుగా మారుస్తామన్నారు. 5,6 నెలల్లో కొత్త గూడంలో ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని అన్నారు. తమపై చేసే విమర్శలను పట్టించుకోబోమని, అభివృద్ధిపై నే దృష్టి పెడతామని మంత్రి వెంకటరెడ్డి అన్నారు. రాష్ట్రంలోని రైతులకు దాదాపు 30 వేల కోట్లతో రెండు లక్షల రుణమాఫీ చేయబోతు న్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అభివృద్ధిలో అన్నికులాలకు, మతాలకు సమాన ప్రాతినిథ్యం ఇస్తున్నామన్నారు. సీతరామా ప్రాజెక్టుతో ఖమ్మ, నల్లగొండకు గోదావరి సాగు నీరు అందుతుం దన్నారు. ఈ ప్రాజెక్టు పేరుతో 9వేల కోట్లను గత ప్రభుత్వం దోచుకుందని ఆరోపించారు. తమది రైతుల ప్రభుత్వం అని చెప్పారు. ప్రజలు కన్న కలలను ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆయన అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఢిల్లీ వెళితే రాష్ట్రానికి జాతీయ రాహదారి వచ్చినట్టేనని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన ప్రతిసారి రాష్ట్రానికి కొత్త రోడ్ శాంక్షన్ చేసి తీసుకొస్తారని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు ట్రయల్ రన్ సక్సెస్‌తో గోదావరి జలాలను ఈ వానాకాలంలోనే సాగు కోసం అందిస్తామన్నారు. గత ప్రభుత్వం సీతారామా ప్రాజెక్టును పూర్తి చేయలేదన్నారు. 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఇదిలావుంటే గత ప్రభుత్వంలో పద్మశ్రీ రామచంద్రయ్యను సన్మానించి అండగా ఉంటామని చెప్పారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ, పేదల ప్రభుత్వం వచ్చిన సందర్భంలో దురదృష్టవశాత్తూ అనారోగ్య రీత్యా పద్మశ్రీ అందరికీ దూరమయ్యారు.

గత ప్రభుత్వం పద్మశ్రీ రామచంద్రయ్యకు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమైందని వ్యాఖ్యానించారు. పద్మశ్రీ పట్ల గత ప్రభుత్వం మాటలకి పరిమితమైందే తప్ప చేతులతో ఆ కుటుంబాన్ని ఆదుకోలేకపోవటం బాధాకరం అని ఆయన పేర్కొన్నారు. పద్మశ్రీ రామచంద్రయ్యకు ఇంటి స్థలం, కోటి రూపాయల నగదు ప్రకటించిన గత ప్రభుత్వం ఆదుకోలేదు అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.

# శాం పిట్రోడాకు కాంగ్రెస్ కీలక బాధ్యతలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యకలాపాల్లోకి తీసుకొస్తారు. అమెరికా లోని వారి గురువు (పిట్రోడా ) విషయం లోనూ ఇలాగే జరగనుంది. ఇప్పుడు ఆయన రాజీనామా చేశారు. కొన్ని రోజుల తరువాత మళ్లీ బాధ్యతలు అప్పగిస్తారు చూడండి..! కొత్త అంశాలను తెరపైకి తెచ్చి ప్రజలను గందరగోళానికి గురిచేసేందుకు , ప్రత్యర్థులను తప్పుదోవ పట్టించేందుకు ఆ పార్టీ చేస్తున్న కుట్రలివి‘ అని మోడీ ఆ వీడియోలో అన్నారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల సమయంలో పిట్రోడా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. తొలుత వారసత్వ పన్ను విధానం గురించి మాట్లాడిన ఆయన, ఆ తర్వాత భారతీయుల రూపురేఖలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ‘ మనది వైవిధ్యమైన దేశం. తూర్పున ఉన్న ప్రజలు చైనీయుల్లా, పశ్చిమవాసులు అరబ్బుల మాదిరిగా కనిపిస్తారు. ఇక ఉత్తరాది వాళ్లు శ్వేత జాతీయులుగా, దక్షిణాదివాళ్లు ఆఫ్రికన్ల మాదిరిగా ఉంటారు‘ అంటూ ఆయన చేసిన పోలికపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ క్రమం లోనే పిట్రోడా తన పదవికి రాజీనామా చేయగా, ఇప్పుడు మళ్లీ ఆయననే ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఛైర్మన్‌గా నియమించడం గమనార్హం.

## డ్రగ్స్ వాడకంపై జాగ్రత్తగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలిసీ తెలియక మత్తుపదార్థాల బారిన పడడం వల్ల యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందని, యువత యొక్క శారీరక మానసిక ఆరోగ్యాన్ని మత్తుపదార్థాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినం సందర్భంగా జూన్ 27, 2024 మహేశ్వరంలో యాంటీ డ్రగ్స్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ మీద పోలీసులు చేస్తున్న పోరాటంలో యువత తమ వంతు భాధ్యత నిర్వహించాలని, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండడంతో పాటు, తమ దృష్టికి వచ్చే నిషేధిత డ్రగ్స్ సరఫరా మరియు వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని తక్షణమే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శశాంక, పలువురు ఐపీఎస్‌లు పాల్గొన్నారు.

## పిసిసి చీఫ్ కోసం కాంగ్రెస్ కసరత్తు..

(మొదటి పేజీ తరువాయి)

ఆ తర్వాత కొత్త వారిని నియమించాల్సి ఉంటుంది. లేదా పొడిగించవచ్చు. అయితే, సీఎంగా, పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ పోస్టును మరొక నేతకు కేటాయించాలని అధిష్టానాన్ని కోరారు. నిజానికి అసెంబ్లీ ఎన్నికలు పూర్తవ్వగానే తెలంగాణ కాంగ్రెస్ కు కొత్త బాస్ వస్తారని అంతా ఊహించారు. కానీ లోక్ సభ ఎన్నికలు వెంటనే ఉండటంతో రేవంత్ రెడ్డినే అధిష్టానం కొనసాగించేసింది. దీంతో ఇప్పుడు మార్పు అనివార్యం కాగా, రేవంత్ రెడ్డి కూడా సామాజిక న్యాయాన్ని దృష్టిలో పెట్టుకొని, కొత్త పీసీసీ చీఫ్ నిర్ణయంపై నిర్ణయం తీసుకోవాలని రేవంత్ కోరారు. బీసీ లేదా ఎస్సీ సామాజికవర్గ నేతకు పీసీసీ దక్కే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, సంపత్ కుమార్ తదితరులు పీసీసీ చీఫ్ ఆశావహుల్లో ఉన్నారు. ఎస్సీ సామాజిక వర్గం నుంచి సంపత్ కుమార్, ఎస్టీ సామాజిక వర్గం నుంచి సీతక్క, బలరాం నాయక్ పేర్లు వినిపిస్తున్నాయి. రేవంత్ ఛాయిస్ గా మంత్రి సీతక్క పేరు తెర మీదకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. గిరిజన మహిళకు పీసీసీ పగ్గాలు అప్పగించటం ద్వారా సానుకూలత పెరిగే అవకాశం ఉందని ఆయన అంచనా వేస్తున్నారు. మరోవైపు పార్టీ జాతీయ స్థాయి పోస్టులుసైతం తెలంగాణ నేతలకు దక్కే అవకాశం ఉంది. సిడబ్ల్యూసీ, జనరల్ సెక్రటరీ, సెక్రటరీ పోస్టులకోసం నేతలు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

## నేడు వరంగల్‌కు సిఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

హనుమకొండ కలెక్టరెట్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సీఎం రివ్యూ చేస్తారని వెల్లడించారు. వరంగల్ మాస్టర్ ప్లాన్ అంశం చర్చకు వస్తాయని, గతంలో ఉన్న మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు సొంత ఎజెండాతో చేసిందని అర్థం అయ్యిందన్నారు. దాన్ని మార్చాల్సి ఉందని చెప్పారు. 3 నెలల కాలవ్యవధి పెట్టి మాస్టర్ ప్లాన్ తయారీ చేస్తామని స్మార్ట్ సిటీ పనుల అంశం చర్చ ఉంటుందని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అంశం చర్చిస్తామని సురేఖ తెలిపారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం, దాని సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తామని, మమూనూర్ ఎయిర్ పోర్ట్ అంశం కూడా చర్చకు వస్తుందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటన కోసం అన్ని ఏర్పాట్లు చేశామని వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.

హెలికాప్టర్‌లో హైదారాబాద్ నుంచి టెక్స్ టైల్ పార్క్ కు 12 గంటలకు సీఎం చేరుకుంటారని చెప్పారు. టెక్స్ టైల్ పార్క్ సందర్శించి కొత్త కంపెనీల స్థాపన, ఉపాధి కల్పన,కోసం ప్రభుత్వ పరంగా చేపట్టాల్సి అంశాలపై సీఎం పరిశీస్తారని తెలిపారు. అక్కడ నుంచి సెంట్రల్ జైల్ కూల్చి ఆ స్థలంలో నిర్మిస్తున్న హాస్పిటల్ నిర్మాణ పనులను సీఎం పరిశీలిస్తారని చెప్పారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకుని వనమహోత్సం ప్రారంభించి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి రివ్యూ చేపడతారని వెల్లడించారున. హనుమకొండ కలెక్టరేట్ లో 15 అంశాలపై సీఎం రేవత్ రెడ్డి సుదీర్ఘంగా రివ్యూ చేస్తారని చెప్పారు. శ్రీ భద్రకాళి గుడి మాఢ వీధుల నిర్మాణం, వరంగల్ నూతన మాస్టర్ ఎలాన్, కాలోజీ కళాక్షేత్రం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్మార్ట్ సిటీ పనులు, రింగ్ రోడ్, మామునూరు ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణలంటి అంశాలపై రివ్యూ మీటింగ్ ఉంటుందని తెలిపారు.

ఎన్నికల కోడ్ ఎఫెక్ట్ వల్ల రెండు నెలలు పనులు చేయలేకపోయామని ఇప్పటికే నయింనగర్ నాలా పనులు, బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. గ్రేటర్ వరంగల్ లో పెండింగ్ పలనులను స్పీడ్‌గా పూర్తిచేసేందుకు సీఎం రివ్యూలో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చెప్పారు.

## బీహార్‌లో కూలిన

# మరో వంతెన

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించిన 6 సంవత్సరాలకే వంతెన దెబ్బతిందని వారు వివరించారు. ఈ వంతెన కూలిపోవడం అవినీతి ఎంత ప్రబలంగా ఉందనేందుకు నిదర్శనమని వారు స్పష్టం చేశారు. అంతేకాదు మరో కొత్త వంతెనను నిర్మించాలని ప్రభుత్వాన్ని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఎందుకంటే... దిఘల్‌బ్యాంక్ బ్లాక్‌లోని తులసియా నుంచి ప్రధాన రహదారిని జయనగర్, లోహద్దడకు ఈ మార్గం కలుపుతుంది. ఇది జాతీయ రహదారి 327ఈ కు అనుసంధానించ బడుతుందని తెలిపారు. గత వారం రోజుల్లో సివాన్, అరారియా జిల్లాల్లో వంతెనలు కుప్పుకూలిన సంగతి తెలిసిందే. మరోవైపు.. కూలిన వంతెన అటు మీడియాలో ఇటు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

# గురుకులాల్లో స్పెషల్ కోటా ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

తదితరులు గురువారం డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఇటు ప్రభుత్వానికి, అటు ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారని, ప్రభుత్వ కార్యక్రమాలను, పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేది.. క్షేత్రస్థాయిలో సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసేది జర్నలిస్టులే అన్నారు.

ఒకరకంగా అటు ప్రభుత్వంతో, ఇటు ప్రజలతో ఉంటూ సమాజ సేవలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. జర్నలిస్టులం దరికీ తక్కువ వేతనాలు ఉండటంతో ఆర్థిక సమస్యలతో జీవనం సాగిస్తున్నారని ఫెడరేషన్ నేతలు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పెద్ద ఎత్తున గురుకులాలను ఏర్పాటు చేసి, నాణ్యమైన విద్యను అందిస్తోందని, అయితే తమ జర్నలిస్టుల పిల్లలకు ఈ గురుకులాల్లో ప్రత్యేక కోటా కింద అడ్మిషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకునే జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ ఇప్పించేలా ప్రభుత్వం నుంచి సర్క్యులర్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విష యంలో ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వం తరపున తమవంతు సహ కారం అందించాలని, జర్నలిస్టుల సంక్షేమం కోసం మానవీయ కోణంలో నిర్ణయం తీసుకోవాలని సంఘం నాయకులు విద్యాశాఖ ముఖ్య కార్య దర్శిని కోరారు. జర్నలిస్టుల వినతులపై ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం సానుకూలంగా స్పందించారు.

## ప్రేమ పేరుతో బాలికపై అత్యాచారం..

# కీచక కానిస్టేబుల్ అరెస్ట్..

**రాజేంద్రనగర్,జూన్ 27(నమస్తే ఉదయం):** ప్రేమ పేరుతో బాలికపై అత్యాచారం చేసిన కానిస్టేబుల్ ను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.నిందితుడి మీద పొక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.గురువారం మధ్యాహ్నం కేసు వివరాలను ఏసీపీ శ్రీనివాస్ ఇన్స్పెక్టర్ నాగేంద్రబాబుతో కలిసి మీడియాకు వివరించారు.2020 బ్యాచ్ కి చెందిన ప్రదీప్ గతంలో పేట్ బషీర్బాగ్ పోలీస్ స్టేషన్ లో పని చేశాడు. ప్రస్తుతం ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్నాడు.అతడు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు.స్థానికంగా నివసించే బాలికను కానిస్టేబుల్ ప్రదీప్ ప్రేమ పేరుతో లోబర్చుకొని అత్యాచారం చేశారు.వీడియోలు తీసి బెదిరిస్తూ.. నాలుగేళ్లుగా బాలికపై అఘాత్యానికి పాల్పడుతున్నాడు.గత ఏడాది వేరే అమ్మాయిని వివాహం చేసుకున్నాడు.బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.దీంతో రాజేంద్రనగర్ పోలీసులు రంగ ప్రవేశం చేసి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న కానిస్టేబుల్ ప్రదీప్ ని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.



# అత్తాపూర్‌లో దారుణం..

## ఛాయ్ పెట్టనందుకు కోడలిని చంపిన అత్త.!

**రాజేంద్రనగర్,జూన్ 27(నమస్తే ఉదయం):** ఛాయ్ పెట్టనందుకు క్షణికావేశంతో ఓ మహిళ తన కోడలిని చంపేసింది.ఈ సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాసన్ నగర్ లో గురువారం చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్,ఇన్స్పెక్టర్ వెంకటరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..హసన్ నగర్ ప్రాంతంలోని చెందిన ఫర్జాన గురువారం ఉదయం చాయ్ పెట్టి



అత్త చేతిలో హత్యకు గురైన కోడలు

ఇవ్వమని తన కోడలు అజ్మీర బేగం(28)కి చెప్పింది.

అందుకు ఆమె నిరాకరించింది.దీంతో క్షణికావేశానికి గురైన జన చున్నీతో కోడలు మెడకు బిగించి ఉరివేసి చంపేసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.నిందితురాలిని అరెస్టు చేశారు.

# సప్తగిరి కాలనీలో ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమం

**కూకట్‌పల్లి, జూన్ 27 (నమస్తే ఉదయం):** జూన్ 23వ తేదీ నుంచి జూలై ఆరవ తేదీ వరకు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమాల సందర్భంగా గురువారం 27వ తేదీ సరికొండ సుదర్శన్ రావు శక్తి కేంద్రం



పరిధిలో ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షులు నర్సింగరావు పర్యవేక్షణలో బూత్ అధ్యక్షులు వై భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సప్తగిరి కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లోజు నరసింహ చారి, సరికొండ రవిశంకర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్ రావు, స్రవంతి, మురళి, సుబ్రహ్మణ్యం స్థానికులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్‌పై దాడి చేయడం హేయమైన చర్య

## ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్

**హైదరాబాద్,జూన్ 27(నమస్తే ఉదయం):** హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమీషనర్ రమేష్ పై ఆటో రిక్షా యూనియన్ నాయకుడు అమానుల్లాఖాన్ చేసిన భౌతిక దాడిని తెలంగాణ గ్రూప్ 1 ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్,హన్మంతు నాయక్ తీవ్రం గా ఖండించారు.అమానుల్లాఖాన్ ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసారు.ప్రభుత్వ ఉద్యోగులు,అధికారులపై దాడులు చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.



## షాద్‌నగర్ బుగ్గారెడ్డి ఆసుపత్రి ముందు

# శవంతో ఆందోళన

**షాద్ నగర్,జూన్ 27 (నమస్తే ఉదయం):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేంద్రం లో గల బుగ్గారెడ్డి హాస్పిటల్ లో ఈనెల 20వ తేదీ గురువారం రోజున వైద్యం కోసం కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన మహేష్ అనే 30 సంవత్సరాల యువకున్ని వారి బంధువులు ప్రభుత్వ వైద్యశాల కు వైద్యం కోసం వచ్చారు. వారి బంధువులు అతని పరిస్థితి చూసి వైద్యులు హైదరాబాద్ ఉస్మానియా లేదా గాంధీ కి తీసుకెళ్లాలని సూచించారని వారి బంధువులు మీడియాతో మాట్లాడుతూ వివరించారు.మహేష్ ను మెరుగయిన వైద్యం కోసం ప్రభుత్వ అంబులెన్స్ లో హైదరాబాద్ కు ప్రయాణ మయ్యారు కానీ అంబులెన్స్ సిబ్బంది పట్టణంలోని బుగ్గారెడ్డి హాస్పిటల్ లో మెరుగైన చికిత్స అందించారు. ఆరు రోజులు బుగ్గారెడ్డి ఆసుపత్రి వైద్యులు అతని పరిస్థితి చూసి కిడ్నీలకు సంబంధించి డయాలసిస్ చెయ్యాలని హైదరాబాద్ మహావీర్ కు పంపించారు.అక్కడ డయాలసిస్ చేస్తున్న క్రమంలో మహేష్ ప్రాణాలు కోల్పోయాడు అక్కడ డయాలసిస్ చేసిన డాక్టర్లు రెండు రోజుల క్రితం తీసుకొస్తే బ్రతికేవాడని ఇంత విషమించే వరకు ఏం చేశారని అన్నారని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. బుగ్గారెడ్డి ఆసుపత్రి వైద్యులు నిర్లక్ష్యం కారణంగా తమ కుటుంబ సభ్యుని ప్రాణాలు తీశారని ఆరోపించారు. బుగ్గారెడ్డి ఆసుపత్రి వైద్యులు ముందే చెబితే మహేష్ బ్రతికే వాడని మీడియా ముందు బోరున విలపించారు.తమకు న్యాయం జరిగే వరకు శవాన్ని తియ్యమని బుగ్గారెడ్డి ఆసుపత్రి ముందు శవం తో ఆందోళన చేపట్టారు. దీంతో ఆసుపత్రి యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇచ్చారు వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు.ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు




ప్రయత్నిస్తున్నారు.ఇదిలా ఉంటే డాక్టర్ లు ఆసుపత్రి యాజమాన్యం మాత్రం వారు డబ్బులు కట్టే స్థోమత లేక ఇక్కడికి వచ్చారు.అతని ఆరోగ్యం ఇంతలా దెబ్బ తినడానికి అతను వాడిన ఆయుర్వేద ఔషధం కారణ మన్నారు. భాదితులు మాత్రం మేము వైద్యము కోసం రెండు లక్షలకు పైగా చెల్లించాం తమ మహేష్ ప్రాణాలు తీశారని మాకు న్యాయం జరిగే వరకు శవాన్ని తియ్యమని ఆసుపత్రి ముందు బోరున విలపించారు.

# గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

## గ్రామపంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 27(నమస్తే ఉదయం):** గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం ఐ.డి.ఓ.సి. సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, ఎంపీఓ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

గ్రామాల్లో పారిశుధ్యం, ఉపాధిహామీ, స్వచ్ఛ భారత్, హరిత హారం కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...

గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంటింటి చెత్త సేకరణ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పకడ్బందీగా అమలు జరిగేందుకు ప్రత్యేక అధికారులు వారంలో మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో మల్టి వర్కర్ల హాజరు రిజిస్టరు, మురికి కాలువల నిర్వహణ రిజిస్టర్, తాగు నీటి ట్యాంక్‌ల శుభ్రం చేసే రిజిస్టర్ (3) రిజిస్టర్లు తప్పకుండా ఉండాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం ఘనంగా నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. దోమలను నివారించి పారిశుధ్య కార్యక్రమం పకడ్బందీగా నిర్వహిస్తే డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా వంటి వ్యాధులను అరికట్టవచ్చన్నారు. మిషన్ భగీరథ నల్లాల సర్వే పూర్తి అయినట్లు ప్రతి గ్రామ పంచాయతీ నుండి ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సిందిగా ఆదేశించారు.

స్వచ్ఛభారత్ మిషన్ కింద ఎవరికైనా మరుగుదొడ్ల



అవసరం ఉంటే లబ్ధిదారులను గుర్తించి పంచాయతీ సెక్రెటరీ ద్వారా ఆన్లైన్‌లో నమోదు చేయించాలని సూచించారు.

ఉపాధిహామీ కింద చేప చెరువులు, నీటి కుంటకు ఏర్పాటుకు రైతులను అవగాహన కల్పించి ఆసక్తి ఉన్న చోట కుంటలు పూర్తి చేయించాలని సూచించారు.

**హరితహారం:** ఈ సంవత్సరం వనపర్తి జిల్లాలో 18 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని, లక్ష్యం పూర్తి చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఉన్న రోడ్లకు ఇరువైపులా పెద్ద మొక్కలు నాటించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న లేఅవుట్ లు ఎన్ని ఉన్నాయి, 10 శాతం ల్యాండ్ ఎంత వారి పూర్తి నివేదికలు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. లేఅవుట్ లలోని 10 శాతం భూమిలో పల్లె ప్రకృతి వనాలు, పట్టణ ప్రకృతి వనాలు పెట్టాలని సూచించారు. అన్ని చోట్లా 6 అడుగుల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గన్ వార్ జెడ్పి సీఈవో యాదయ్య డిఆర్డిఏ పిడి ఉమాదేవి డిపిఓ కే. రమణ మూర్తి, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓ లు , ఎంపీఓ, లుతదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలి

## - సిపిఎం డిమాండ్

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్27(నమస్తే ఉదయం):** కేంద్ర బిజెపి ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను ఆపి సింగరేణికి నేరుగా కేటాయించాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ డిమాండ్ చేశారు సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్ర బిజెపి ప్రభుత్వం వేలంపాటను వేస్తున్నదని సింగరేణి కంపెనీ కూడా ప్రైవేట్ సంస్థలతో వేలంపాటలో పోటీపడాలని స్థితికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు వాస్తవానికి శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వాలి కానీ వేలంపాట ద్వారా ప్రైవేట్ సంస్థలకు అవకాశం కల్పించి బొగ్గు గనులను సరైంది కాదన్నారు మన రాష్ట్రం నుంచి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి గారు హైదరాబాద్ కేంద్రంగా వేలంపాటను ప్రారంభించడం సిగ్గుచేటు అని అన్నారు బొగ్గు గనులన్నీ ప్రైవేటు సంస్థలకు ఇచ్చిన తర్వాత సింగరేణి మిగిలేదే ముంటుందని క్రమంగా సింగరేణి సంస్థను బలహీనపరిచి నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు నగదీకరణ పేరుతో దేశంలో ఆరు లక్షల కోట్ల విలువైన అస్తూలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టిందని అందులో భాగం గానే కోట్ల విలువైన గనులను ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలని నిర్ణయాన్ని తీసుకుందని విమర్శించారు గత పది సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం దాదాపుగా 200 బొగ్గు భవులను ప్రవేశ సంస్థలకు కట్టబెట్టారని ప్రభుత్వ రంగంలో గనులు లేకపోతే యువతకు ఉపాధి అవకాశాలు కనుమరుగవుతాయి అని ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకోలేకపోయారని




విమర్శించారు,ప్రస్తుతం సింగరేణి 40 వేల మంది పర్మినెంట్ కార్మికులకు మరో 26,000 మంది కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నదని రికార్డు స్థాయిలో అతి తక్కువ ధరకే నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్న ఘనత సింగరేణి సంస్థకే చెందుతుందని అన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు అనేక రూపాలలో ఆదాయాన్ని తీసుకొస్తున్న సింగరేణిని ప్రైవేటీకరణ అప్పజెప్పి ప్రభుత్వ ఉపాధి అవకాశాలను కొల్లగొడుతున్న కేంద్ర ప్రభుత్వ ధమననీతిని రాష్ట్ర ప్రజానీకం ఖండించాలని అన్నారు బొగ్గు గనుల ప్రైవేటీకరణ వేగంగా జరిగితే విద్యుత్తు ధర విపరీతంగా పెరుగుతుందని అన్నారు సింగరేణికి చెందిన 22 బొగ్గు బావుల్లో బొగ్గు నిల్వలు అడగండి పోయాయని కొత్త బ్లాకులో తవ్వకాలు ప్రారంభించాలని కానీ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఇందుకు అనుమతించకుండా మోకాలు అడ్డుతున్న దని విమర్శించారు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల తెలంగాణ ప్రజానీకానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని కాబట్టి శ్రావణపల్లి బ్లాకు తో పాటు మిగతా బ్లాక్ లను కూడా తక్షణమే సింగరేణి అప్పగించాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వము అఖిలపక్షాన్ని కలుపుకొని కేంద్రం మీద ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు అందుకు అనుగుణంగా రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకొని శాసనసభ తీర్మానం చేయాలని లేని పక్షంలో ప్రజానీకాన్ని కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చూడతమని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి రాజు వివి నరసింహ ఉప్పేర్ నరసింహ బాలకృష్ణ రాజు వెంకటేష్ పరశురాముడు మజ్జిగ ఆంజనేయులు గజేంద్ర అయ్యప్ప నరసింహ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# హిమాయత్ నగర్ గ్రామాన్ని సందర్శించిన డిఎల్ పిఓ సతీష్ రెడ్డి

**మొయినాబాద్ జూన్ 27( నమస్తే ఉదయం):**
గ్రామాలలో ప్రభుత్వ వరంగా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చేవెళ్ల డిఎల్ పి ఓ కళ్యాణ్ సతీష్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామ పంచాయతీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, పారిశుధ్య కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గ్రామంలోని గ్రామ కంఠమైన పరిధిలో ఓ ఇంటి నిర్మాణం కుటుంబ సభ్యుల సమస్య పరిశీలించేందుకు విచ్చేయడం జరిగిందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం గ్రామాలలోని సమస్యలు పరిష్కరించేందుకు సాయశక్తుల కృషి చేస్తున్నామని ఆయన సూచించారు.

## బావి తవ్వుతుండగా మట్టిలో
# కూరుకుపోయి వ్యక్తి మృతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 27(నమస్తే ఉదయం):**
ఓ రైతు పొలంలో వ్యవసాయ బావిని తవ్వుతుండగా ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మట్టిలో చిక్కుకుని మృతి చెందిన ఘటన గురువారం కేటిదొడ్డి మండలంలో చోటు చేసుకుంది. వివరాలకు వెళ్లితే... కేటిదొడ్డి మండలం ఇర్కిచేడు గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో పురాతన వ్యవసాయ బావి తవ్వకం చేసే పనిని చేపట్టారు. బావిని తవ్వుతుండగా అడుగున ఇసుక తేలడంతో దానిని పరిశీలించేందకు కూలీ జయరామ్(42) బావిలోకి దిగాడు. అయితే ప్రమాదవశాత్తు బావిలో దిగిన ఆయనపై మట్టి దిబ్బలు ఒక్కసారి కూలడంతో పీకల్లోతు వరకు మట్టిలో చిక్కుకపోయాడు. సమాచారమందుకున్న కేటిదొడ్డి పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు.

స్థానికులు, హిటాచీ సహాయంతో నాలుగు గంటల పాటు శ్రమించి మట్టి తవ్వకాలు చేపట్టారు. మట్టిదిబ్బలు మీద పడటంతో ఊపిరాడక మృతి చెందాడు. మృతదేహాని బయటకు తీశారు. మృతునికి భార్యతో పాటు పిల్లలు ఉన్నారు.



## విద్యుత్ షాక్‌తో
# ఆర్టీజెన్ కార్మికుడు మృతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 27(నమస్తే ఉదయం):**
విద్యుత్ షాక్‌తో ఆర్టీజెన్ కార్మికుడు(గ్రేడ్ -2) మృతి చెందిన సంఘటన గురువారం గట్టు మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన గట్టు ఎస్ఐ కేటి మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గట్టు మండలంలోని ఆలూరు విద్యుత్ సబ్ స్టేషన్లో ఆర్టీజెన్ కార్మికుడికిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మన్ గురువారం ఎ.ఇ చిన్నయ్య విద్యుత్ లోడ్ ఎక్కువ అయిందని, కరెంటు త్రీ ఫీజు నుండి సింగిల్ ఫేస్ కి మార్చుమని చెప్పగా ఆయన ఆదేశాలపై కరెంటు సబ్ స్టేషన్లో బ్రేకర్ ట్రిప్ చేయకుండా డైరెక్ట్‌గా పెంచికలపాడు 1/3 AB స్విచ్ ఆపరేట్ చేయడం వల్ల ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కి గురై మృతి చెందాడు మృతుడికి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు పిల్లలు ఉన్నారు.



## పూల్ బాగ్ కాలనీలో రోడ్డు నిర్మాణ పనులను
# త్వరగా పూర్తి చేయాలి

**- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి**

**కూకట్‌పల్లి, జూన్ 27 (నమస్తే ఉదయం):**
పూల్ బాగ్ కాలనీలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫూల్ బాగ్ కాలనీలో జరుగుతున్న వీడీసీసీ రోడ్డు పనులను స్టాండింగ్ కమిటీ సభ్యులు బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి గురువారం పర్యవేక్షించారు.



ఈ సందర్భంగా కార్పొరేటర్ అధికారులకు సూచిస్తూ కాలనీ నీరు ఆగకుండా లెవెలింగ్ మెయింటైన్ చేస్తూ అలాగే నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్వాణ పనులను త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఆదేశించారు. అదేవిధంగా కాలనీలో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా తక్షణమే తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం డీఈ బాలకిషన్, ఏఈ మహమ్మద్ రషీద్, వర్క్ ఇన్స్పెక్టర్ రాములుతో పాటు కాలనీ అధ్యక్షులు సభాపతి రెడ్డి, అనిల్ కుమార్, ప్రభాకర్ రెడ్డి, బాల్ రెడ్డి, భగవాన్, మల్లారెడ్డి, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సబ్ ప్లాన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి: జాన్ వెస్లీ

**గద్వాల, జూన్ 27(నమస్తే ఉదయం):**
సబ్ ప్లాన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి బడ్జెట్లో తగినన్ని నిధులు కేటాయించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు, గురువారం స్థానిక వాల్మీకి కమిటీ హాల్లో ప్రారంభమైన కెవిపిఎస్ సామాజిక శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సబ్ ప్లాన్ చట్టం నీరుగారి పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు చట్టమున్న పకడ్బందీగా అమలు చేయడం లేదని అన్నారు రానున్న బడ్జెట్లో సబ్ ప్లాన్ కు ప్రత్యేక నిదులు కేటాయించి దళితుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని అన్నారు గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడల వల్ల దళితులకు బడ్జెట్లో కేటాయించిన నిధులు ఖర్చు చేయకుండా రావలసిన సంక్షేమ పథకాలు కూడా అమలు చేయలేదని విమర్శించారు,కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను తము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వల్ల సంపద కేంద్రీకరణ పెరిగి అణగారిన కులాలకు జాతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ప్రైవేటీకరణ వల్ల దళితులకు అందుతున్న రిజర్వేషన్లు పూర్తిగా తగ్గుతాయని, దీనివల్ల నిరంతర దాడులు ఇంకా పెరుగుతాయని అన్నారు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో




జిల్లా అధికార యంత్రాంగం విఫలమైందని విమర్శించారు జిల్లాలో సంక్షేమ వసతిగృహాలపై కెవిపిఎస్ గా సర్వే నిర్వహించామని సర్వేలో వచ్చిన సమస్యలపై జిల్లా అధికార యంత్రంగం తక్షణం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు నిత్యవసర వస్తువుల ధరలకు అనుగణంగా విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని శిథిలావస్థలో ఉన్న భవనాలకు సొంత భవనాలు నిర్మించాలని ఖాళీగా ఉన్న హాస్టల్ వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థుల సంఖ్య కనుగుణంగా వర్కర్లను నియమించాలని డిమాండ్ చేశారు శిక్షణ తరగతులకు కేబీసీల అధ్యక్ష కార్యదర్శులు మారెన్న జి.రాజు రాష్ట్ర కమిటీ సభ్యులు పరంజ్యోతి మండలాల కార్యదర్శులు ఆంజనేయులు, విజయ్ కుమార్, నాగరాజు ,వివిధ మండలాల కార్యకర్తలు బద్రి అయ్యప్ప, బజారన్న, కరెప్ప, అంజి తదితరులు పాల్గొన్నారు.




మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి గృహప్రవేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డితో స్థానిక నాయకులు

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి గృహప్రవేశం

**కొత్తకోట, జూన్27(నమస్తే ఉదయం):**
వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కేంద్ర వాస్తవ్యులు, అలంపూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు (బిజెపి) డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డి గృహప్రవేశం ఘనంగా జరిగింది.

గురువారం జరిగిన డాక్టర్ పారిజాతం, రావుల రవీంద్రనాథ్ రెడ్డి గృహప్రవేశం కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి సోద రుడు ఏ తిరుపతిరెడ్డి, సిడిసి మాజీ చైర్మన్ మూలమల్ల చంద్ర శేఖర్ రెడ్డిలతోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సాగర్ గౌడ్‌కు మొక్కను అందజేసి స్వాగతం పలుకుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి



సాగర్ గౌడ్‌తో కలిసి మొక్క నాటుకున్న మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి

# అడుగులో అడుగేద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

**- మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి**

**కొత్తకోట, జూన్27(నమస్తే ఉదయం):**
అడుగులో అడుగేద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దామని వనపర్తి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. కృష్ణ సాగర్ అలంపూర్ జోగులాంబ ఆలయం నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేస్తూ... ఊరూరా నడుం బిగిస్తూ మొక్కలు నాటుతూ సాగర్‌కు అడుగులో అడుగేద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

గురువారం అడ్డాకల్ మండలం హైవేలో పాదయాత్రకు మాజీ పార్లమెంట్ సభ్యులు, వనపర్తి మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి సంఘీభావం తెలు పుతూ... శాలువాకప్పి, కృష్ణ సాగర్‌కు సన్మానించినారు, వారికి పండ్లు, వాటర్ బాటిల్స్, అందించి అభినందించారు.

అలాగే హైవే రావుల చంద్రశేఖరరెడ్డి, కృష్ణ సాగర్‌తో కలిసి చెట్లు నాటినారు.

పర్యావరణ పరిరక్షణ, వాయు కాలుష్యం మహోన్నత కార్యక్రమంలో మనవంతు బాధ్యతగా వారికి సంఘీభావంగా కార్యక్రమంలో పాల్గొని మన కర్తవ్యాన్ని నిర్వర్తిద్దాం అని రావుల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.

# డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలి...

## అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు...

**కూకట్‌పల్లి, జూన్ 27 (నమస్తే ఉదయం):**
ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా సత్వరమే డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు.
కూకట్ పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో అంతర్గత డ్రైనేజీ పొంగి పొర్లుతుందన్న విషయం తెలుసుకున్న కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులతో కలిసి డ్రైనేజీ పొంగుతున్న ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ విధంగా డ్రైనేజీ పొంగుతుంటే డ్రైనేజీ నీళ్లు ఇండ్లలోకి చేరుతుందని, అందు వలన ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతారన్నారు. కావున వీలైనంత త్వరగా డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని, 20 వేల లీటర్ల మంచినీళ్ళ వాడుకోవడం కోసం గత ప్రభుత్వం జీఓ జారీ చేసింది. అయినా వాటర్ వర్క్స్ అధికారులు గత ప్రభుత్వంలో వాడుకున్న నీటికి కూడా డబ్బులు కట్టమని ప్రజలకు పిడిస్తున్నారు. ఈ విధంగా



ఎమ్మెల్యే కృష్ణారావుకు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

ప్రజలను ఇబ్బందులు పెట్టి డబ్బులు తీసుకొవడం మంచి పద్ధతి కాదని, పేదవారిని ఇబ్బంది పెట్టి అధికారులు డబ్బులు వసూలు చేస్తే ప్రజా ఉద్యమం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, వీరారెడ్డి, సయ్యద్ రియాజ్, రమేష్ , ముత్యాల దుర్గ మరియు జీహెచ్ఎంసీ అధికారులు డి.ఈ ఆనంద్, ఎ.ఈ.రంజిత్, జలమండలి అధికారులు విలయం ప్రకాష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist,
Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.